క్లుప్తంగా

వీబీఆర్‌లో నిలకడగా నీటిమట్టం



లింకు చానల్ ద్వారా వీబీఆర్ లోకి వస్తున్న కృష్ణా జలాలు

వెలుగోడు: తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటిమట్టం నిలకడగా ఉంది. వీబీఆర్ పూర్తి స్థాయి నీటిమట్టం 16.95 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 14.760 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వీబీఆర్‌లోకి 9,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. అలాగే వీబీఆర్ నుంచి మద్రాసు కాలువకు 5వేలు, స్పిల్ వే ద్వారా గాలేరుకు 6వేలు క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 40 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 20 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి అవసరాలకు 15 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం



మసీదుపురంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

మహానంది: మండలంలోని మసీదుపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలోని శివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాజా మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.7 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మించారు. అందుకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గ్రామానికి చెందిన ఓ. వీరభద్రారెడ్డి ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని గ్రామ సర్పంచ్ కాకనూరు లక్ష్మిరెడ్డి తెలిపారు. విషయాన్ని మహానంది పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నంద్యాల జిల్లా వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు బి.వి.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమన్నారు. విద్యార్థులకు వివిధ అంశాలలో వక్తృత్వ, వ్యాసరచన, పాటలు, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఎస్‌ఓ శ్యామల, ఉపాధ్యాయినులు, వయోజన విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే సహించం



పాములపాడులో మండపం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్‌బాబు

పాములపాడు: గ్రామాల్లో వినాయక ఉత్సవాలను ఆసరాగా చేసుకొని అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని ఎస్‌ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన మండపాల వద్ద నిర్వాహకులతో మాట్లాడారు. తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు సూచించారు. భక్తులు వేడుకలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. నిమజ్జనం వేడుకల్లో ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

పంట నష్టంపై సర్వే

కొత్తపల్లి: ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు మండలంలో సుమారు 7వేల ఎకరాల దాకా పొలాలు నీటమునిగాయి. అందులో ఎన్నిఎకరాలలో పంటనష్టం వాటిల్లిందన్న అన్న విషయంపై సర్వే ప్రారంభం అయింది. ఆదివారం మండల పరిధిలోని ఆయా గ్రామాలలో వ్యవసాయశాఖ ఏఓ కె.మహేష్, రెవెన్యూ శాఖ తహసీల్దార్ ఉమారాణిల ఆధ్వర్యంలో వ్యవసాయ గ్రామ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది సర్వే చేపట్టారు. గుమ్మడాపురం వీఆర్వో నరసింహ, ఆర్‌బీకే సిబ్బంది రవీంద్ర నాయక్ రైతులు రాజులు ఉన్నారు.

చవితి వసూళ్లపై విమర్శలు

మహానంది: వినాయక చవితి సందర్భంగా మహానంది దేవస్థానంలో ఏర్పాటు చేసిన వినాయకుడు, నిమజ్జన ఉత్సవాలకు సంబంధించి ఆలయంలో పనిచేసే వారి నుంచి వసూళ్లు చేయడం విమర్శలకు తావిచ్చింది. కొందరు ఉన్నత ఉద్యోగులు విగ్రహం ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో ముఖ్య అర్చకులు, అర్చకులు, పరిచారకులు, కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలుకు ఆదేశించినట్లు సమాచారం . మహానంది ఆలయ అర్చకులు మూలస్థానం సుబ్బయ్యశర్మ, ఉమాదేవి దంపతులు విగ్రహాన్ని ఇప్పించారు. వసూళ్లపై సోషల్ మీడియాలో కొందరు వైరల్ చేయడంపై ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఉన్నత ఉద్యోగులకు మందలించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సాక్షి ఈఓ దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేస్తామని చెప్పారు.



ఆత్మకూరు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో కొలువుదీరిన గణనాథుడు



ఆత్మకూరు తోటగేరిలో..



సున్నిపెంటలో కొలువుదీరిన వినాయకుడు



దేవస్థాన సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



ఆత్మకూరు జెండా రస్తా వద్ద వెలిసిన వినాయకుడు

పార్వతీ నందనాయ.. నమో నమః

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా గణపతి విగ్రహాల ఏర్పాటు
- పత్రి, పూలు సమర్పించి పూజలు చేసిన జనం

ఆత్మకూరు: వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించి ఆదివారం పూజలు చేశారు. పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లో రూ.1.20 లక్షలతో వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో తయారు చేసిన తెలిచ్చిన విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంతో పాటు అంబాభవానీ, శివాలయం, అమ్మవారిశాల సమీపంలోనూ తోటగేరి, మెయిన్‌బజారు, కప్పలకుంట్ల, అర్బన్ కాలనీ, నవాజ్ ఏరియా, పాత పోస్టాఫీసు వీధి, సాయిబాబానగర్, ఏకలవ్యనగర్ తదితర ప్రాంతాల్లో 42 విగ్రహాలు కొలువుదీరాయి. గతేడాది కంటే ఈ యేడాది అత్యధికంగా పలు కాలనీల్లో గణనాథులు కొలువుదీర్చారు. అలాగే మండలంలోని కరివేన, నల్లకాల్వ, బాపునంతపురం, అమలాపురం, కృష్ణాపురం, వెంకటాపురం, సిద్దాపురం, వడ్లరామాపురం, కురుకుంద తదితర గ్రామాల్లోనూ గణనాథులను కొలువుదీర్చారు.

నేడు నిమజ్జనం..

పట్టణంలో కొలువుదీరిన గణనాథులు సోమవారం పాములపాడు మండలం ఎర్రగూడూరు సమీపంలోని ఎస్‌ఆర్‌ఎంసీ కెనాల్‌లో సోమవారం నిమజ్జనం చేయనున్నారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గణనాథుల శోభాయాత్ర ప్రారంభమవుతుంది. పట్టణంలో 42 విగ్రహాలతో పాటు నందికుంట, బాపునంతపురం తదితర గ్రామాల గణనాథులతో కలిపి పాములపాడు మండలం ఎర్రగూడూరు సమీపంలోని ఎస్‌ఆర్‌ఎంసీ కెనాల్‌లో నిమజ్జనం చేయనున్నారు. డీఎస్పీ రామంజినాయక్ ఆధ్వర్యంలో సీఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, ఓబులేస్, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



మహానందిలో వినాయకుడికి పూజలు చేస్తున్న దృశ్యం



తిమ్మాపురంలో ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

వెలుగోడు: మండలంలో ప్రజలు వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం తలంటు స్నానం ఆచరించి భక్తి శ్రద్ధలతో 21 రకాల పిండి వంటలు తయారుచేసి గణనాథునికి నైవేద్యంగా సమర్పించారు. పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మహిళలు నోములు నోచారు. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలో యువత వీధి వీధిన గణనాథులు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 75 వినాయక విగ్రహాల ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపారు. పట్టణంలో 39,బోయిరేవుల 9,గుంతకందల 3,రేగడ గూడూరు 5, వేల్పనూరు 5, అబ్దుల్లాపురం 4,మాధవరం 3,మోత్కూరు 4,తిమ్మనపల్లె 1 విగ్రహాలను ఆయా ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మహానంది: వినాయకచవితి పర్వదినం సందర్భంగా మండలంలో వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మండలంలో మొత్తం 96 విగ్రహాలు నెలకొల్పారు. మహానంది పుణ్యక్షేత్రంలో కొలువైన మూలగణపతికి శనివారం విశేష పూజలు చేశారు. ఏఈఓలు వై.మధు, ఓంకారం వేంకటేశ్వరుడు ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ముఖ్య అర్చకులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, ప్రత్యేక అభిషేకం , పత్రి, గరికపూజలు, వ్రతకథా శ్రవణం, పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ అర్చకుడు మూలస్థానం సుబ్బయ్యశర్మ, ఉమాదేవి దంపతులు విగ్రహాన్ని అందించగా ఆలయ ముఖద్వారంలో కొలువు చేసి విశేష పూజలు చేశారు. గాజులపల్లెలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వినాయకుడిని కొలువు చేసి విశేష పూజలు జరిపారు. తిమ్మాపురం గ్రామంలో అశోక్ ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన కోలాటం నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తమ్మడపల్లెలో కొలువైన గణనాథుడి వద్ద జమాల్ అనే ముస్లిం యువకుడు స్వయంగా లడ్డూ ప్రసాదం చేయించి తీసుకొచ్చాడని ఓం యూత్ ప్రతినిధి శ్రీకాంత్ తెలిపారు.

శ్రీశైలంప్రాజెక్టు: సున్నిపెంట,లింగాలగట్టు గ్రామాలలో శనివారం వినాయకుల విగ్రహాలు కొలువుతీరాయి. 40 వినాయకుని ప్రతిమలను మండపాలలో ప్రతిష్ఠించారు. భక్తిశ్రద్ధలతో వినాయకునికి పూజలు చేశారు.

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో పలు కాలనీలలో వినాయకచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం వినాయకచవితిని పురస్కరించుకుని క్షేత్ర పరిధిలోని శ్రీగిరి కాలనీ, కొత్తపేట, మేకలబండ, వ్యాపార దుకాణా సముదాయం, వర్క్‌షాప్, మల్లికార్జున కల్యాణ మండపం, టోల్‌గేట్, సెంట్రల్ రిసెప్షన్ ఆఫీసు, శానిటేషన్ విభాగం, పాతాళగంగ, వెంగయ్యసత్రం, పెద్దసత్రం తదితర ప్రదేశాలలో మొత్తం సుమారు 30 పైగా విగ్రహాలను ప్రత్యేక మండపాలలో నెలకొల్పారు.

ఉండ్రాళ్లయ్యా...దండాలయ్యా

నందికొట్కూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఊరూరా, వాడవాడలా మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. పట్టణంలో-50, గ్రామీణ ప్రాంతాల్లో-67 విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

జూపాడుబంగ్లా: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, తర్తూరు, మండ్లెం, 80బన్నూరు, తరిగోపుల, తూడిచెర్ల, పారుమంచాల, పోతులపాడు, భాస్కరాపురం,పి.లింగాపురం గ్రామాల్లో వినాయకుని ప్రతిమలను ప్రతిష్టించారు. గ్రామాల్లోని భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మండలం వ్యాప్తంగా 55 విగ్రహాలు ప్రతిష్టించినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మిడుతూరు: స్థానిక రామేశ్వర స్వామి, వినాయకుడి కట్ట, బస్టాండు కూడలి, వాల్మీకి దేవాలయం, చౌడేశ్వరీ దేవాలయం ఆవరణలో వినాయకుడి ప్రతిమలను ప్రతిష్టించారు. ఆయా కాలనీల ప్రజలు స్వామివార్లకు తీపి పదార్థాలతో తయారు చేసిన ఉండ్రాళ్లు, బజ్జీలు, పత్తెర, బిల్వ పత్రాలు, మామిడి ఆకులు, మొక్కజొన్న కంకులు, చెరుకు గడలు, పండ్లు తదితర వాటిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో 59 వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. స్వామి వారికి ప్రీతికరమైన పిండివంటలు నైవేద్యంగా సమర్పించి, భక్తులకు పంచిపెట్టారు. రాత్రి వేళల్లో భజనలు చేశారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా వినాయక మండపాల వద్ద ఆనందంగా వేడుకలు నిర్వహించారు.



నందికొట్కూరు సంగయ్యపేటలో జై యూత్ ఆధ్వర్యంలో గణేష్‌కి ప్రత్యేక పూజలు



కొత్తపల్లిలో కొలువుతీరిన గణనాథుడి విగ్రహం



తాటిపాడులో వినాయకుడికి మొక్కుతున్న భక్తులు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పీకే ప్రాగటూరు, వనుములపాడు, సంకిరేణిపల్లె, బీరవోలు, కొత్త పాలమర్రి, పగిడ్యాల, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం,ఎన్. ఘణపురం తదితర గ్రామాల్లోని ప్రజలు వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఊర్భూ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన భక్తులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. భక్తులకు పురోహితులు వీరయ్య తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 85 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 82 విగ్రహాల నిమజ్జనం ఉంటుందని, లక్ష్మాపురం, ముచ్చుమర్రి గ్రామాల్లో మంగళవారం నిమజ్జనం చేస్తారని వివరించారు.



గువ్వలకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

కొత్తపల్లి: శనివారం వినాయక చవితిని పురస్కరించుకొని గ్రామాలలో గణనాథుల విగ్రహాలు కొలువుదీరాయి. ఆదివారం కూడా భక్తులు భక్తిశ్రద్ధలతో బొజ్జగనపయ్యకు విశేషపూజలు చేసుకున్నారు.

డీజేలకు అనుమతులు లేవు

నిమజ్జనం రోజున వినాయక విగ్రహాల ముందు డీజేలకు అనుమతులు లేవని ఎస్ఐ ఎం.కేశవ ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 12గ్రామపంచాయతీలలో 46 వినాయక విగ్రహాలు భక్తులు ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. అందులో దుద్యాల, ఎదురుపాడు గ్రామాలలో 5 రోజుల నిమజ్జన కార్యక్రమం కాగా, మిగతా గ్రామాలలో 3 రోజులకు అంటే సోమవారం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని వివరించారు.

వరద బాధితులకు విరాళం

నందికొట్కూరు: విజయవాడ వరద బాధితులకు తమవంతు సహాయ సహకారాలు అందించినట్లు సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సీపీఐ రైతు సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 8,100లు విరాళాలు సేకరించి పంపడం జరిగిందని తెలిపారు. వరద నుంచి ప్రజలను కాపాడటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. దాతలు ముందుకు వచ్చి మంపు బాధితులకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు సోమన్న, ఏసన్న, తిరుపాలు, బీబీ, మల్లేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవండి

ఆత్మకూరు: విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు శ్రీశైలం నియోజకవర్గంలోని ప్రజలు సహాయ సహకారం అందించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని కొండా గార్డెన్‌లో శ్రీశైలం నియోజకవర్గం ఎన్‌డీయే కూటమి విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు మన వంతు సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. గత వారంలో సంభవించిన భారీ తుఫాన్ వల్ల విజయవాడ పట్టణంలో పలు కాలనీలు జలమయమయ్యాయని, సీఎం రిలీఫ్ ఫండ్‌కు తమకు తోచినంత సాయం అందజేయాలని చెప్పారు. ఆత్మకూరు, వెలుగోడు, శ్రీశైలం, బండిఆత్మకూరు, మహానంది మండలాల నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నసేవలో సమాచార కమిషనర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ సి.సునీల్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన కమిషనర్ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో కమిషనర్ దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఈఓ స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.



మల్లన్న ఆలయంలో కమిషనర్ సునీల్

ఆత్మీయ సమ్మేళనం ఓ మధురానుభూతి

మహానంది: ఒకే చోట చదువుకున్న వారంతా ఎన్నో ఏళ్ల తర్వాత నాటి స్నేహితులు, గురువులను కలిసే ఆత్మీయ సమ్మేళనం ఓ మధురానుభూతిని మిగుల్చుతుందని యం .తిమ్మాపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె. లక్ష్మణరావు తెలిపారు. 2013-18 సంవత్సరం విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. వారిని ఉద్దేశించి ప్రిన్సిపాల్ కె.లక్ష్మణరావు మాట్లాడుతూ బాల్యంలో తల్లిదండ్రులు గురువులైతే విద్యార్థి దశలో విద్యాబోధన, సమాజంలో ఎలా మెలగాలో నేర్పేది ఉపాధ్యాయులేనన్నారు. పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ మరియదాస్ మాట్లాడుతూ పట్టుదలతో చదివి ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పూర్వవిద్యార్థులు పాఠశాలకు పోర్టబుల్ స్పీకర్‌ను విరాళంగా అందజేశారు. ఉపాధ్యాయులు నరేష్, గోవింద్, నీలం వెంకటేశ్వర్లు, హజీబాష, ప్రసాద్, పద్మావతి, భారతి, జమాలమ్మ, పూర్వ విద్యార్థులు ద్వారకరెడ్డి, మనోజ్, సాయినాథ్ ,మక్బుల్, శ్రావణి, కల్పన, జాహ్నవి పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆర్థిక సాయం

పాములపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అనారోగ్యానికి గురై మృతి చెందిన మణికుమారి(18) కుటుంబానికి శనివారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబం నిరుపేదరికంతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న అథితి హోటల్ యజమాని కురువ రమేష్ రూ.10,000, వేంపెంట గ్రామానికి సింగపూర్ నాగేశ్వరరావు రూ.6,000, పాములపడు చాకలి గోవిందు రూ.5,000అ చొప్పున అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాతకక్షలతో ఘర్షణ

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామానికి చెందిన సుమన్‌గౌడు, వంశీకి పాతకక్షలున్నాయి. వీటిని మనస్సులో పెట్టుకొని శుక్రవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకొన్నారు. ఈ ఘర్షణలో ఒకరి తలకు, మరొకరి కాలికి గాయాలు కాగా వారు ఆసుపత్రికి వెళ్లి ఎంఎల్‌సీ రిపోర్టు తెచ్చుకొని జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసునమోదు చేసి, విచారణ చేపట్టినట్లు తెలిపారు.

దామగట్లలో కూలిన 12 మట్టిమిద్దెలు

నందికొట్కూరు: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో శనివారం 12 మంది మట్టిమిద్దె కుప్పకూలిపోయాయి. విజయమ్మ, చాంద్‌బాషా, మౌలాలి, మాధయ్య, ఖలీల్, గౌడ్‌తో పాటు మరో 6గురికి చెందిన మట్టిమిద్దెలు కూలిపోవడంతో వీధిన పడ్డారు. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

ఆత్మకూరు: పట్టణంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్‌డీయే ప్రభుత్వం పట్టణ, గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోనూ, ఆత్మకూరు పట్టణంలో రోజు మార్చి రోజూ మంచి నీరు సరఫరా చేయడం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ శివారు కాలనీలు వర్షాల వల్ల రోడ్లు బురదమయంగా మారాయని, ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రామునాయక్, మంజుల, సురేంద్ర, స్వాములు, సద్దాంహుసేన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంసీలోకి భవనాశి నీరు



సైడ్ బండ్ లీకేజీలతో ఎస్‌ఆర్‌ఎంసీలోకి చేరుతున్న భవనాశి నీరు

పాములపాడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో మండలంలోని భవనాశి వాగు నీరు ఎస్‌ఆర్‌ఎంసీ కాలువలోకి లీకేజీతో చేరుతున్నాయి. పాములపాడు -చెలిమిల్ల గ్రామానికి అనుసంధానంగా ఎస్‌ఆర్ ఎంసీపై ఉన్న సూపర్‌ప్యాసేజీ వంతెన వద్ద నీరు లీకవుతున్నాయి. ఎస్‌ఆర్‌ఎంసీ సైడ్ బండ్ నుంచి భవనాశి నీరు కాలువలోకి చేరుతున్నాయి. వర్షాలు భారీగా కురిసినప్పుడల్లా ఇదే పరిస్థితి. ఇలాగే కొనసాగితే సైడ్‌బండ్ నాణ్యతను కోల్పోయి కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు సైడ్‌బండ్ పటిష్టత పర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పగిడ్యాల: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో కేవీపీఎస్ జిల్లా నాయకురాలు గంధం ఉసేనమ్మ అధ్యక్షతన సీపీఎం పార్టీ నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వారం రోజులకు పైగా ఎడతెరపి లేని వర్షాల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మినుము, మిరప, ఉల్లి, మొక్కజొన్న, వరి తదితర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఇప్పటికే పంట నమోదు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. పంట నష్టం అంచనాలో వ్యవసాయ అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, రాజకీయ నాయకులు సూచించిన రైతుల పేర్లు కాకుండా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పంట నమోదును చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈశ్వరమ్మ, సీపీఎం కార్యకర్తలు మధులత, మద్దమ్మ, త్యాగరాజు, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఆదివారం కొట్టాల చెరువు నుంచి ఆటోలో కొందరు వ్యక్తులు కొత్తపల్లి మండలం వైపు వెళ్తున్నారు. అదేసమయంలో గడివేముల మండలం కొరటమద్ది గ్రామానికి చెందిన ప్రసాద్, సుదర్శన్ ఆత్మకూరు పట్టణానికి చెందిన షాహీద్ అనే స్నేహితుడితో కలసి బైకుపై కొలను భారతి, సంగమేశ్వరం పుణ్యక్షేత్రాలను దర్శించుకొని వస్తుండగా మండల పరిధిలోని నందికుంట గ్రామ సమీపాన బ్రిడ్జి వద్ద ఆటో ఢీకొంది. ఈ ఘటనలో కొరటమద్ది గ్రామానికి చెందిన ప్రసాద్ అనే యువకుడికి కుడికాలు విరిగి పోయింది. మరో ఇద్దరికి రక్తగాయాలు అయ్యాయి. స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు ఎస్ఐ ఎం.కేశవ వెల్లడించారు.